క్లుప్తంగా

మట్టి వినాయక ప్రతిమలనే వాడాలి



ఉంగుటూరులో కళాజాతతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఉంగుటూరు: కాలుష్యరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటు పడాలని చాటిచెబుతూ రాబోయే వినాయక చవితికి మట్టి వినాయకుని మాత్రమే వాడాలని కళాకారులు బుర్రకథ ద్వారా ప్రజలను ఆదివారం చైతన్యపరిచారు. ఉంగుటూరు తూర్పుకాపుల రామాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలను ఎంత గానో ఆకట్టుకుంది. కాలుష్య నియంత్రణ మండలి వారి ఉత్తర్వులను అనుసరించి ఈ కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారుల బృందం లీడరు యడవల్లి రమేష్ ఆధ్వర్యంలో ఇచ్చిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

కొవ్వలిలో వైద్యశిబిరం



కొవ్వలిలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: 50 మంది కొవ్వలి గ్రామస్తులు జ్వరాలబారిన పడటంతో కొవ్వలిలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి కృపావరం, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్. శర్మిష్ఠ, తహసీల్దార్ బీ.సుమతి పర్యవేక్షిస్తున్నారు. దోసపాడు, దెందులూరు, కొవ్వలి, ఉండ్రాజవరంలో ఏఎన్ఎంలు, ఆశాలు జ్వరాలపై ఇంటింటా సర్వే ఆదివారం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

భీమడోలు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద గల డివైడర్‌లో ఆదివారం మండల సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు వర్ధనీడి సత్యసాయి ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన 50 పొగడ మొక్కలను ఆయన నాటారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు వట్టి పవన్, నేతలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కోట్లమ్మ సంబరం



ప్రత్యేక అలంకరణలో కోట్లమ్మవారు

ఉంగుటూరు: నారాయణపురం గ్రామదేవత కోట్లమ్మవారి ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. చిన్న వెల్లమిల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని ఆలయం వద్ద నిర్వహిస్తున్న పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరదలపై కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలి

దెందులూరు: భారీ వర్షాలకు రైతులు, ప్రజలకు ఎటువంటి నష్టం జరిగినా ఆపద సమయం వచ్చినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తోడ్పాటును అందించాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. ప్రజలు, వారి ప్రాంతాల్లో భారీ వర్షాలతో ప్రమాదం ఎక్కువగా ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 1800-233-1077, 9491041188 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని అబ్బయ్యచౌదరి సూచించారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరులో ఒక లారీ డ్రైవరు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు తంగెళ్లమూడికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు లారీ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహమైంది. కొంతకాలం క్రితం భార్య విడిపోయి వేరే చోట ఉంటోంది. పిల్లలు కూడా ఆమెతోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఉమామహేశ్వరరావు ఆదివారం తంగెళ్లమూడి నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో ఒక చర్చి సమీపంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసి 108 అంబులెన్స్‌లో అతన్ని సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్సనందిస్తున్నారు. లారీ డ్రైవర్ ఆత్మ హత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులు తెలియాల్సి ఉంది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పొంగుతున్న గుండేరు వాగు



దెందులూరు: కొవ్వలిలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న గద్దె రమేష్



పెదపాడు: రామిలేరు కాలువ ఉధృతిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

- భారీ వర్షాలకు ముంపు బారిన వరి చేలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న రామిలేరు కాలువ

దెందులూరు: భారీ వర్షాలకు గుండేరువాగు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. మండలంలోని సత్యనారాయణపురంలో ఈ వాగు వల్ల గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతి వర్షాకాలంలో, వరదల్లో గుండేరు వాగుకు ప్రవాహం పెరగడం, ఇబ్బందిపడటం తమకు అలవాటు అయిపోయిందని సత్యనారాయణపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు వైపు నుంచి ఇటు వైపుకు కాలిబాటలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దెందులూరు సైఫన్ వద్ద గుండేరు వాగు ప్రవాహానికి గ్రామాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం ఎంపీడీఓ వీ.శ్రీలత, ఈఓఆర్‌డీ స్వామి, వీఆర్వో అనిరుధ్, శ్రీను, గ్రామ కార్యదర్శి బీఎస్ చౌదరి పరిశీలించారు.



సత్యనారాయణపురంలో ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న గుండేరువాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ స్పెషల్ డ్రైవ్

మండల ప్రత్యేకాధికారి ఎస్. కృపావరం, దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, వీఆర్వో శ్రీను శనివారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సత్యనారాయణపురం హైవే వద్ద, దెందులూరులోని సైఫన్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామస్తులు, ఉద్యోగులను మూడు ప్రాంతాలను ఏర్పాటు చేసి ప్రతి గంటకూ మూడు ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ పరిశీలించి జిల్లా అధికారులకు సమాచారాన్ని తెలియజేశారు.

200 ఎకరాల్లో పంట మునక

దెందులూరు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 200 ఎకరాల వరి పంట ముంపునకు గురైంది.పోతునూరు, కొవ్వలి, ఉండ్రాజవరం, దోసపాడు, సోమవరప్పాడు, ఉప్పుగూడెంలో పంట మునిగింది. ఆదివారం దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ వి.శ్రీలత, ఏఓ గద్దె రమేష్ ముంపుకు గురైన పొలాలను పరిశీలించారు. పంట నష్టంపై నివేదికలను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేదని భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రామిలేరు ఉధృతిని పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్

పెదపాడు: భారీ వర్షాలకు రామిలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోందని అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఆదివారం రామిలేరు కాలువ ఉధృతిని పరిశీలించారు. వంతెన వద్ద గట్టు తెగే ప్రమాదం పొంచి ఉందని యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశించారన్నారు. పెదపాడు మండలంలో చినసత్యవోలు, సకలకొత్తపల్లి, కడిమిగుంట, సత్యవోలులో జెడ్పీచైర్‌పర్సన్ అధికారులతో కలిసి పర్యటించారు. పంట పొలాలు, ముంపు గ్రామాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చినుకులుతోకూడిన ముసురు

ఉంగుటూరు: రోజంతా చినుకులతో కూడిన ముసురు పట్టింది. శనివారం రాత్రి మొదలై ఆదివారం వరకు వర్షం కురుస్తూనే ఉంది. 25.4 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో లోతట్టు పొలాల్లోకి నీరు చేరింది. బాదంపూడి, రామన్నగూడెం, కైకరం శివారు ప్రాంతాల్లో పంట చేలు మునిగాయి. మెట్ట ప్రాంతంలో మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండిపోయాయి. గోపినాథపట్నం పెద్ద చెరవు, గొల్లగూడెం, గోకవరం, నీలాద్రిపురం, ఉంగుటూరు, యర్రమళ్ల తదితర చెరువులు వర్షం నీటితో నిండిపోయాయి. ఇన్‌ఛార్జి తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు వీఆర్వోలను అప్రమత్తం చేశారు. గోపినాథపట్నం, ఉంగుటూరు, మెట్ట ప్రాంతంలోని ఇతర గ్రామాల్లో చెరువులను తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు, డీఎల్‌డీవో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో ఆఫీస్ సూపరిండెంటు ఆంజనేయులు పరిశీలించారు. మండలంలో పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. ఆయాగ్రామ రెవెన్యూ అధికార్లు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.



దెందులూరు వద్ద గుండేరువాగు ప్రవాహానికి రక్షణ చర్యలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వి.శ్రీలత



గోపినాథపట్నం పెద్ద చెరువు పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దారు బొడ్డేపల్లిప్రసాదు, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి



దెందులూరు: పోతునూరులో మునిగిన వరి పొలాలు

కరెంటుతో జాగ్రత్త !

దెందులూరు: భారీ వర్షాలు కారణంగా ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదానికి గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఎస్.త్రివాస్ అన్నారు. తడిచిన కరెంటు స్తంభాలను పట్టుకోకూడదు. తడిచిన చేతులతో మోటార్లు, స్టార్టర్లు పట్టుకోకూడదు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను తాకకూడదు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలకు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలి. పార్కుల్లో, స్టేడియంలో, విద్యుత్ స్తంభాలు పట్టుకోకూడదు. ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డులను తడి చేతులతో ముట్టుకోకూడదు. బయట పెట్టిన లైట్లను తడవకుండా చూసుకోవాలి. కరెంటుకు సంబంధించిన వస్తువులు తడి చేతులతో తాకకూడదు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి. తడిచిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు. గాలి, దూమారం వర్షం వల్ల తెగిన విద్యుత్ తీగలను పట్టుకోకూడదు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్‌ను ఉపయోగిస్తే స్విచాఫ్ చేసి ప్లేగ్ తీసిన తరువాతనే నీటిని విడుదల చేసుకోవాలి. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిస్‌కనెక్ట్ చేయాలి. వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జి, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలి. లేకపోతే వైర్లు షాక్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. కరెంటు లైను కింద సెల్‌ఫోన్ మాట్లాడకూడదు. ఇంట్లోకి వచ్చే సర్వీసు ఏ విధమైన డ్యామేజ్ అయితే సంబంధిత జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఎం, అసిస్టెంట్ ఇంజనీర్ దృష్టికి తీసుకువెళ్లాలని ఏడీఈ త్రివాస్ అన్నారు.

ఉంగుటూరు జోన్ అధ్యక్షుడిగా పోలిశెట్టి సత్యేంద్ర



ఉంగుటూరు జోన్ కార్యవర్గం సభ్యులను అభినందిస్తున్న జిల్లా, రాష్ట్ర నాయకులు

భీమడోలు: ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉంగుటూరు జోన్ అధ్యక్షుడిగా భీమడోలు సత్యేంద్ర స్కూలు అధినేత పోలిశెట్టి సత్యేంద్ర, కార్యదర్శిగా గొల్లగూడెం శ్రీసూర్య స్కూలు ప్రిన్సిపల్ వేముల చైతన్య, కోశాధికారిగా చెట్టున్నపాడు ఎస్ఎల్‌జీ ప్రిన్సిపల్ వినోద్‌లు ఎన్నికయ్యారు. జిల్లా ఈసీ కమిటీ సభ్యులుగా భీమడోలు మానస పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం చింతలపూడిలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

నేడు డిగ్రీ కళాశాలకు నాక్ బృందం రాక

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ కమిటీ సభ్యులు వస్తున్నారు. రెండు రోజులు కళాశాలను పరిశీలిస్తారు. ఈమేరకు సన్నాహక సమావేశం పూర్వ విద్యార్థులు సంఘం, అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆదివారం ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు సమావేశం నిర్వహించారు. నాక్ కమిటీలో చైర్మన్‌గా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అమితాబ్ సక్సేనా రవీంద్రనాథ్ ఠాగూర్, కో ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతికుమార్, డాక్టర్ మీనాక్షి, ఆర్జేడీ డాక్టర్ శోభారాణి వస్తున్నట్లు ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు వెల్లడించారు. కళాశాల అభివృద్ధిని పర్యవేక్షిస్తున్న పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, శ్రీసాగిరాజు జానకి రామరాజు, బొమ్మిడి అప్పారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ, సర్పంచి దిడ్ల అలకానంద శ్రీనివాసు ఏర్పాట్లను చేస్తున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఈకార్యక్రమంలో భాగస్వాములు కావాలని పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ కోరారు. కళాశాల ప్లానింగ్ అండ్ డవలప్‌మెంటు కౌన్సిల్ మెంబర్లు కళాశాల పూర్వవిద్యార్థులు, తల్లితండ్రుల సహకారంతో ప్రోత్సాహంతో కళాశాల అభివృద్ధిని ఏడు కేటగిరీల్లో మదింపు చేసి నాక్ టీము సభ్యులు గ్రేడు ఇస్తారని ప్రిన్సిపాల్ విశ్వేశ్వరావు వివరించారు.



నారాయణపురంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

గణపవరం: చిత్తశద్ధి అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు ప్రజల హృదయాల్లో కలకాలం నిలిచిపోతారని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం ఎంఈవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన కరుమజ్జి రాంబాబు సన్మాన కార్యక్రమం గణపవరం కేవీపీ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎంఈవో పుచ్చల శేషు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాంబాబు దంపతులను ఎమ్మెల్యే ధర్మరాజు తదితరులు దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. నిడమర్రు ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, వైఎస్సార్‌సీపీ గణపవరం మండల బాధ్యుడు పుప్పాల చినబాబు, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, మాజీ ఎంఈవోలు వంగ పండు, పాశం పాండురంగారావు, ఎంపీ రామరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎంఈవో రాంబాబును ఘనంగా సత్కరించారు.



ఎంఈవో రాంబాబును సత్కరిస్తున్న దృశ్యం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి : రాట్నాలమ్మ అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.30,600, విరాళాలు రూ.1,806, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.16,155 ఫొటోల విక్రయం ద్వారా రూ.1,555 ఆదాయం లభించగా మొత్తం రూ. 50,116 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ చెప్పారు.

నిన్ను మరువలేం రాజన్న

నేడు 15వ వర్ధంతి

దెందులూరు: అపర భగీరథుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డికి దెందులూరు నియోజకవర్గంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ముఖ్యమంత్రి హోదాలో మూడుసార్లు నియోజకవర్గానికి విచ్చేశారు. పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రవేశపెట్టి అమలు చేసిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం తదితర పథకాలతో నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు రైతులు అధిక సంఖ్యలో లబ్ధి పొందారు. శాశ్వత ఉపాధి, శాశ్వత ఆరోగ్యాన్ని పొందారు. ఆరేళ్ల బాలుడు నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు డాక్టర్ వైఎస్సార్ పథకాలు పొందని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ముఖ్యమంత్రి కాకముందు పీసీసీ అధ్యక్షుడిగా, అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారానికి సైతం స్వయంగా రాజశేఖరరెడ్డి విచ్చేశారు. అంతకుముందు పాదయాత్ర అనుభూతులు, ఆత్మీయ బంధాలు సైతం దెందులూరు నియోజకవర్గంతో ఉన్నాయి.



డాక్టర్ వైఎస్సార్‌తో ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు (ఫైల్)

డాక్టర్ వైఎస్సార్ మా కుటుంబ ఆత్మీయ బంధువు, ఆయనతో మా కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. ఆయన చూపులోనే ఆదరణ, ఆప్యాయత, అనురాగం కనబడుతుందన్నారు. ఆయన లేని లోటు వ్యక్తిగతంగా, కుటుంబానికి తీరని లోటని కొఠారు అన్నారు.

నాట్య మయూరి జ్ఞానేశ్వరి కన్నుమూత

భీమడోలు: చైన్నయ్ ఆసుపత్రిలో లివర్ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న నాట్య మయూరి మామిడి జ్ఞానేశ్వరి (14) కన్నుమూసింది. నెల రోజులకు పైగా మృత్యువుతో ఆ చిన్నారి పోరాడి ఓడింది. శనివారం ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచింది. చిన్నారి మృతదేహం అంబులెన్స్‌లో ఏలూరుకు ఆదివారం రాత్రి చేరుకుంది. కుటుంబ సభ్యులు, పాఠశాలల యాజమాన్యం, తోటి విద్యార్థులు, దాతలు, మానవతావాదులు మరణవార్తను విని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. తల్లి కోట దుర్గ తన బిడ్డకు అవసరమైన లివర్‌లో 40శాతం ఇవ్వడంతో



మామిడి జ్ఞానేశ్వరి (ఫైల్)

గత నెల 2,3వ తేదీల్లో చైన్నైయ్ ఆసుపత్రిలో జ్ఞానేశ్వరికి దాతల ఆర్థిక సాయంతో లివర్ మారి్పడి ఆపరేషన్ చేసినా ఫలితం దక్కలేదు. బిడ్డ మృతితో కోట దుర్గ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. కోట దుర్గ పోలసానిపల్లి బీసీ కాలనీకి చెందిన ఏలూరులోని సచివాలయం 2లో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తోంది. జ్ఞానేశ్వరి సంపూర్ణ ఆరోగ్యంతో వచ్చి నృత్య ప్రదర్శనలు చేయాలని అందరూ ఆకాంక్షించినా ఫలితం లేకపోయింది. ప్రతి ఒక్కరినీ ఆమె మరణం కలిచివేసింది.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ చార్జీల ఆదా

- విద్యుత్ ఆదా కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకం
- బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం

పెదపాడు: గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ఆదా కోసం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కోసం బ్యాంకులు రుణ సదుపాయాన్ని అందిస్తున్నాయి. ప్రభుత్వం అందించే రాయితీతో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని, ఈ పథకంలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే గృహ విద్యుత్ చార్జీలు 90శాతం వరకు ఆదా అవుతుందని పెదపాడు విద్యుత్ శాఖ ఏఈ వై.రాంబాబు చెప్పారు. ఎవరైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రతి మండలానికి 2000 వరకు సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. మండలానికి ఎంతమందికి కావాలంటే అంతమందికి సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందించేందుకు అవకాశం ఉందని చెప్పారు.



పొలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్

సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో కలిగే లాభాలు

సోలార్ రూఫ్‌టాప్	ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు సామర్థ్యం	వినియోగదారుడికి ప్రస్తుతం వస్తున్న బిల్లు
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.1,000
2 కిలోవాట్స్	240 యూనిట్లు	రూ.2,000
3 కిలో వాట్స్	360 యూనిట్లు	రూ.3,000

రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు తర్వాత (సుమారుగా)

వచ్చే బిల్లు	ఏడాదికి ఆదా	ప్రభుత్వ రాయితీ
రూ.338	రూ.8,000	రూ.30,000
రూ.333	రూ.20,000	రూ.60,000
రూ.293	రూ.32,400	రూ.78,000

దరఖాస్తు ఇలా..

ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇంటి పై కప్పుపై కనీసం 10 చ.మీ/100 చ.మీ స్థలంలో 1కిలో వాట్ ఫవర్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తాయని తెలిపారు. దీంతోపాటు వ్యవసాయ విద్యుత్‌కు సోలార్ ప్లాంటు ఏర్పాటుకు పీఎం కుసుమ్ పథకాన్ని ఏర్పాటు చేసింది దీనికోసం నిర్ణీత విధానంలో దరఖాస్తు చేస్తుకోవాలని సూచించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎం సూర్యఘర్.జీవోవి.ఇన్ / ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు, విద్యుత్ సమస్యల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

ప్రజలకు ఆర్థికంగా మేలు



సోలార్ విద్యుత్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి విద్యుత్ అంతరాయం ఉండదు. దీంతో పాటు విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. దీని ప్రజలకు మేలు చేకూరుతుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు వీటికి రుణాలు అందిస్తున్నాయి. వెండార్‌ను కూడా లబ్ధిదారుడే నిర్ణయించుకోవచ్చు. నచ్చిన బ్యాంకును కూడా నిర్ణయించుకుని రుణం పొందవచ్చు.

– వై రాంబాబు
పెదపాడు మండల విద్యుత్ శాఖ ఏఈ